

పవర్‌ఫుల్ 'పోలీస్ డాగ్స్'

- ఎనిమిది నెలల కఠోర శిక్షణ
- శాంతి భద్రతల రక్షణలో తమదైన పాత్ర

7

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జీవన్‌రెడ్డి

అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించిన టీపీసీసీ

7

నేడు దీక్షా దివస్

- తెలంగాణ సాకారానికి బాటలు వేసిన దీక్ష
- కీలక ఘట్టానికి వేదికైన కరీంనగర్
- అల్గునూరు చౌరస్తాలో కేసీఆర్ అరెస్టు



కరీంనగర్ తెలంగాణ భవన్ నుంచి దీక్షకు బయలుదేరుతున్న కేసీఆర్ (ఫైల్)


(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

దీక్షా దివస్ ... నవంబరు 29న బీఆర్ఎస్ జరుపుకునే దీక్షా దివస్ మలి దశ తెలంగాణ ఉద్యమాన్ని కీలక మలుపుతిప్పి ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు బాటలు వేసిన రోజు.. ఆ చారిత్రక ఘట్టానికి కరీంనగర్ గడ్డ వేదిక అయింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును డిమాండ్ చేస్తూ తొమ్మిది సంవత్సరాలుగా సాగుతున్న ఉద్యమంలో పెను కదలిక తీసుకవచ్చి గుణాత్మక దశకు చేర్చడానికి కేసీఆర్ నడుంకట్టిన రోజు.. తెలంగాణ వచ్చుడో... కేసీఆర్ సచ్చుడో.. అని నినాదమిచ్చి కేసీఆర్ సిద్దిపేట సమీపంలోని రంగధాంపల్లి వద్ద ఆమరణ నిరాహారదీక్ష చేసేందుకు కరీంనగర్ నుంచి బయలు దేరారు. ఆయనను అలుగునూరు సమీపంలో అరెస్టు చేశారు. పదకొండు రోజులపాటు నిరాహారదీక్ష చేయడంతో ఆనాటి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి తెలంగాణరాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించామని ప్రకటించింది.

తెలంగాణ ఉద్యమానికి, కేసీఆర్‌కు సెంటిమెంట్ జిల్లాగా నిలిచిన కరీంనగర్ జిల్లా తెలంగాణ రాష్ట్ర చరిత్ర పుటల్లో ప్రత్యేక స్థానాన్ని పదిలపరుచుకున్నది... కేసీఆర్ అరెస్టు అయి దీక్షలో ఉండి ఉద్య మ దీప్తిని రగిలించిన రోజును బీఆర్ఎస్ దీక్షా దివస్‌గా నిర్వహి స్తోంది. ఈసారి నవంబరు 29 నుంచి డిసెంబరు 9 వరకు 11 రోజులపాటు దీక్షా దివస్‌ను నిర్వహించాలని నిర్ణయించింది. దీనికి ఆ పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హాజరవుతారు. కేసీఆర్‌ను అరెస్టు చేసిన అల్గునూ రు సెంటర్‌లోనే బహిరంగ సభను నిర్వహిస్తున్నారు.

• ఆరోజు ఏం జరిగిందంటే..

2009, నవంబరు 26న కేసీఆర్ రాత్రి 8 గంటలకు కరీంనగర్ సమీపంలోని తీగలగుట్టపల్లిలో ఉన్న ఉత్తర తెలంగాణ భవన్ (కేసీఆర్ భవన్)కు చేరుకున్నారు. 27న కేసీఆర్ భవన్‌లో అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించారు. 28న సుమారు 10వేల మంది కేసీఆర్ భవన్‌కు తరలివచ్చారు.



అల్గునూర్‌లో కేసీఆర్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు (ఫైల్)

మిగతా 8వ పేజీలో..

జ్యోతిబా పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

మంత్రి పొన్నం ప్రభాకర్



పూలె విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, కలెక్టర్ పమేలాసత్పతి

చిగురుమామిడి, నవంబరు 28: జ్యోతిబా పూలే ఆశయ సాధనకు కృషి చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. మండలంలోని సుందరగిరిలో మహాత్మ జ్యోతిబా పూలే వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలోని అన్ని సామాజిక వర్గాల ప్రజలు చదువుకోవాలని మహాత్మ జ్యోతిబా పూలే కోరుకున్నారన్నారు. తల్లిదండ్రులు ఒక పూట తినకున్నా పిల్లలను మంచి చదువులు చదివించాలన్నారు. చదువు జ్ఞానాన్ని, కుటుంబ ప్రగతిని, వ్యవస్థను బాగు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, రాష్ట్ర హౌసింగ్ సొసైటీ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి, హుస్నాబాద్, సైదాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సుధాకర్, చిట్టుమల్ల రవీందర్, ఐరెడ్డి సత్యనారయణరెడ్డి, మాజీ సర్పంచ్‌లు రమేష్, సుద్దల ప్రవీణ్, చిత్తరి రవీందర్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏలూరి శ్రీనివాస్

సుభాష్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం కరీంనగర్ టీఎన్‌జీవోస్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నికలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శులకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ కేంద్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, ఎలక్షన్ ఆఫీసర్ జగన్‌మోహన్‌రావు, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, టీజీవో నాయకులు రామకృష్ణగౌడ్, శ్యామ్, పరమేశ్వర్‌రెడ్డి, రవికుమార్, మామిడి రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, లింగారెడ్డి, విష్ణువర్దన్, లక్ష్మీనరసింహరావు, గడ్డం సుధాకర్, రాగి శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, సర్దార్ హర్మిందర్‌సింగ్, రాజేశ్‌భరద్వాజ్, కరుణాకర్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.

కమిషనరేట్‌కు 349 కానిస్టేబుల్స్ కేటాయింపు

కరీంనగర్ క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కమిషనరేట్‌కు 349 మంది కొత్త కానిస్టేబుల్స్‌ను కేటాయిస్తు పోలీస్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుల్స్‌ను రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాలకు కేటాయించారు. ఈ మేరకు కరీంనగర్ కమిషనరేట్‌కు 150 మంది సివిల్ కానిస్టేబుల్స్ (పురుషులు), 86 మంది మహిళలు, 96 మంది ఏఆర్ కానిస్టేబుల్స్ 18మంది ఏఆర్ మహిళ కానిస్టేబుల్స్‌ను కేటాయించారు. వీరు రెండు రోజుల్లో రిపోర్టు చేయనున్నారు. కమిషనరేట్‌లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. దీంతో ట్రాఫిక్, ఇతర విధులకు సిబ్బంది అందుబాటులో లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి



అల్గునూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

తిమ్మాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అలుగునూర్‌లో నిర్వహించే దీక్షాదివస్ కార్యక్రమానికి తెలంగాణవాదులు, ప్రజలు భారీగా తరలిరావాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. ఆయన అలుగునూర్‌లో తలపెట్టిన దీక్షా దివస్ కార్యక్రమానికి సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను గురువారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆనాడు కేసీఆర్ అమరణ దీక్ష చేయకపోతే తెలంగాణ వచ్చేదా అని ప్రశ్నించారు. ఆయన దీక్ష చేసి 15 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 29న దీక్ష దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతా రావు, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు ఐలేందర్ యాదవ్, గందె మాధవి, మహేష్, తుల శ్రీదేవి చంద్రమౌళి, ఎడ్ల సరిత అశోక్ పాల్గొన్నారు.

విద్యార్థులను పట్టించుకోరా..

- గురుకులాల్లో విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటున్నా ప్రభుత్వం స్పందించడం లేదు
- తెలంగాణ చౌక్‌లో ఏబీవీపీ నిరసన



తెలంగాణ చౌక్‌లో నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

గణేశ్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ పూసల విష్ణు విమర్శించారు. కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ గురుకుల విద్యార్థుల ప్రాణాలతో రాష్ట్ర ప్రభుత్వం ఆడుకుంటోందన్నారు. సంవత్సర కాలంలో 51 మంది గురుకులాల విద్యార్థులు వివిధ కారణాలతో ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. గురుకులాల్లో కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. భోజనం నాసిరకంగా ఉండడంతో ఒకే సంవత్సరంలో 886 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. రాష్ట్రంలో మద్యానికి మంత్రి ఉన్నాడు కానీ విద్యకు మంత్రి లేడని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి గురుకులాల్లో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి బామండ్ల నందం, హాస్టల్స్ ఇన్‌చార్జి అన్నాడి శ్రీ వర్ధన్, జోనల్ ఇన్‌చార్జిలు అనిల్, విష్ణు, యోగేష్, వంశీ, హరీష్, హరిఓం, ఆకాష్, ప్రశాంత్,అభిలాష్ పాల్గొన్నారు.

- పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్‌పై ప్రభుత్వం స్పందించాలి
- కళ్లకు గంతలు కట్టుకొని ఎస్ఎఫ్ఐ నిరసన



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గణేశ్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటనలపైన ప్రభుత్వ స్పందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో కళ్లకు గంతలు కట్టుకొని గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మధ్యాహ్న భోజన వికటించి అస్వస్థతకు గురవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కంపెల్లి అరవింద్, జిల్లా ఉపాధ్యక్షుడు ఇషాక్, నాయకులు గట్టు ఆకాష్, రాకేష్, సందేశ్, నాయకులు పవన్, విశ్వక్, శివ, ఉదయ్, వరుణ్, మధు పాల్గొన్నారు.

30న జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన

భగత్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ నెల 30 నుంచి 2వ తేదీ వరకు జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు డీఈవో జనార్దన్‌రావు తెలిపారు. గురువారం సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన 2024-25, ఇన్‌స్పైర్ అవార్డ్సు ప్రదర్శన 2023-24 నిర్వహి స్తున్నామన్నారు. ఈ ప్రదర్శనకు 578 మంది నమోదు చేసుకున్నారన్నారు. ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక చేసిన పాఠశాలల నుంచి 142 మంది విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొంటారన్నారు. జూనియర్ విభాగం నుంచి ఏడు, సీనియర్ విభాగం నుంచి ఏడు ప్రదర్శనలను, ఇన్‌స్పైర్ అవార్డ్సులో 13 ప్రదర్శనలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామ న్నారు. ఎంపిక చేసిన డిగ్రీ కళాశాలల అధ్యాపకులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారన్నారు. రాష్ట్ర స్థాయి ప్రదర్శన తేదీలు త్వరలో ప్రకటిస్తారని తెలిపారు. ప్రదర్శనలో పాల్గొనే విద్యార్థులకు సెమినార్ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో డీసీఈబీ సెక్రెటరీ మారం స్వదేశ్‌కుమార్, సైన్స్ ఆఫీసర్ చాడ జయపాల్‌రెడ్డి, ఎంఈవో ఎండీ అబ్దుల్ అజీం, భగవంతయ్య, కో ఆర్డినేటర్ కేఏస్ అనంతాచార్య, సెయింట్ జార్జి పాఠశాల చైర్మన్ పాతిమారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

కరీంనగర్ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను డీఆర్డీవో శ్రీధర్ గురువారం పరిశీలించారు. పనుల ప్రగతిపై ఏపీవో శోభరాణిని అడిగి తెలుసుకున్నారు. రెండు రోజుల క్రితం ప్రారంభించిన ఉపాధి పనుల జాతర పనులపై ఆరా తీశారు. మార్చి 31లోగా పనులు పూర్తి కావాలని ఆదేశించారు. మండలంలో అవసర మున్న ప్రాంతాల్లో పనులను గుర్తించాలని అధికారులకు సూచించారు. రైతులకు పశువుల షెడ్‌లు, కోళ్ల ఫారాల నిర్మాణం, పొలంగట్లపై మొక్కల పెంపకం, బావుల తవ్వకం వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాజమల్లయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ సుజాత పాల్గొన్నారు.



కోళ్ల షెడ్‌ను పరిశీలిస్తున్న డీఆర్డీవో శ్రీధర్

నేరాలు జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

సీపీ అభిషేక్ మొహంతి



కేశవపట్నం పోలీస్‌స్టేషన్లో సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి

శంకరపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందితో మాట్లాడారు. వారికి కేటాయించిన విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ అభిషేక్ మొహం తి మాట్లాడుతూ వివిధ నేరాల్లో పట్టుబడి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాల గురించి అడిగి, వాటిని తొలగించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ లోని పెండింగ్ కేసులపై సమీక్షించి, త్వరగా వాటిని పూర్తి చేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి చూపుతూ, స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరుచూ సందర్శించాలన్నా రు. పాత నేరస్థులపై నిఘా ఉంచాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో, గ్రామాల్లో, వార్డుల్లో వీధి రౌడీలుగా చలామణి అవుతూ గ్రూపులుగా ఏర్పడి సామాన్య ప్రజలను బెదిరించే వారిని, శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిని గుర్తించి వారిపై రౌడీ షీట్లు తెరవాలన్నారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెల వారికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా గ్రామ ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. పెండింగ్ వారెంట్లు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో హుజూరాబాద్ రూరల్ సీఐ పులి వెంకట్‌గౌడ్, ఎస్ఐ కొత్తపల్లి రవి పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఆభరణాలు అప్పగింత


ఆభరణాల బ్యాగ్‌ను బాధితురాలికి అప్పగిస్తున్న ఎస్ఐ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తూ ఒక మహిళ తన హాండ్‌బ్యాగ్ పోగొట్టుకోగా అందులో 10 తులా బంగారు ఆభరణాలున్నాయని పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ బ్యాగ్‌ను వెదికిపట్టుకుని బంగారు ఆభరణాలతో సహా బాధితురాలికి అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లికి చెందిన హీనా పర్వీన్ అనే మహిళ బుధవారం తన తల్లితో కలిసి కరీంనగర్ నుంచి ఆటోలో గ్రామానికి వెళ్లింది. ఈ సమయంలో తన హాండ్ బ్యాగ్‌ను ఆటోలోనే మరిచిపోయింది. కొద్దిసేపటి తరువాత తన హ్యాండ్ బ్యాగ్ కనిపించకపోవటంతో గంగాధర పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన ఎస్ఐ నరేందర్‌రెడ్డి సిబ్బందిని అప్రమత్తం చేసి గాలింపు చర్యలు ప్రారంభించి, సైబర్ క్రైం పోలీసులు, సిబ్బందితో గంటల సమయంలోనే ఆటోను గుర్తించి హాండ్‌బ్యాగ్‌ను వెదికిపట్టుకున్నారు. 10 తులాల బంగారు ఆభరణాలు, మొబైల్‌ఫోన్‌లతో కూడిన హ్యాండ్ బ్యాగ్‌ను భద్రతంగా బాధితురాలికి అప్పగించారు. సత్వరమే స్పందించి, బంగారు ఆభరణాల బ్యాగ్‌ను భద్రంగా వెదికిపట్టుకోవటంలో కృషి చేసిన ఎస్ఐ నరేందర్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ రాజయ్య, కృష్ణారెడ్డి, కానిస్టేబుల్ మాణిక్యరెడ్డి, ప్రదీప్‌లను కరీంనగర్ పోలీస్‌కమిషనరేట్ కేంద్రంలో సీపీ అభిషేక్ మొహంతి అభినందించారు. వారికి రివార్డులతోపాటు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు.

మృతదేహం లభ్యం

పెద్దపల్లిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో గురువారం మృతదేహం లభించినట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. స్థానికుల సమాచారంతో అక్కడికి వెళ్లి చూడగా మృతదేహం కుళ్లిపోయి ఉందని, బయటకు తీసి జేబులు తనిఖీ చేయగా ఆధార్‌కార్డు ఉందని తెలిపారు. ఆధార్‌కార్డులో ఉన్న చిరునామా బీహార్ రాష్ట్రంలోని నస్గంద్ రోతాస్‌కు చెందిన నందకిషోర్‌రాంగా గుర్తించారు. మృతుడు కాకీ కలర్ స్వెటర్, బ్లూజీన్స్ వేసుకొని ఉన్నాడు. మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వాస్పత్రి మార్చురీలో ఉంచినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం..

కోల్‌సిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మున్సిపల్ జంక్షన్‌లోని డ్రైన్‌లో గుర్తు తెలియని మృతదేహాన్ని గురువారం గుర్తించారు. పెట్రోల్ బంక్, మున్సిపల్ కార్యాలయం మధ్యలో ఉన్న డ్రైన్‌లో మృతదేహం ఉంది. 35సంవత్సరాల వయసు గల వ్యక్తిదిగా భావిస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉంచినట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

వ్యవసాయ బావిలో గుర్తు తెలియని మృతదేహం

గొల్లపెల్లి, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి) గొల్లపల్లి మండలం చిల్వాకోడూరు గ్రామానికి చెందిన వ్యవసాయ భూమిలో గురువారం గుర్తుతెలియని మృత దేహాన్ని స్థానికులు గుర్తించారు. మృదతదేహం పూర్తిగా కుళ్లిన పోయి గుర్తు పట్టడానికి కూడా వీలు లేకుండా ఉన్నది. మృతుడి కుడి చేయి పై సౌజన్య అని పచ్చ బొట్టు ఉన్నది. మరో చేయిపై దిక్కులను సూచిస్తున్న పచ్చ బొట్టు ఉన్నది. కేసు నమోదు చేసుకొని సంఘటనా స్థలంలోనే పోస్ట్ మార్టం నిర్వహించినట్టు గొల్లపెల్లి ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపారు.

యువకుడి మృతిపై విచారణ చేపట్టాలి

- ప్రజా సంఘాల నాయకుల డిమాండ్


ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

వీర్నపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్జనపల్లి గ్రామానికి చెందిన ఈశంపల్లి అశీష్ (19) అక్టోబరు 1న తన స్నేహితులతో కలిసి వీర్నపల్లి వైపు వెళుతుండగా అడవి పదిర గ్రామశివారులో ద్విచక్రవాహనం అదుపు తప్పిగాయపడి అసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కాగా తమ కుమారుడిని స్నేహితులే గాయపర్చినట్లు అనుమానం వ్యక్తం చేస్తూ బాధితులపై చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి కనకయ్య ఎస్పీ అఖిల్‌మహాజన్‌కు దరఖాస్తు ఇచ్చాడు. మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి అంబులెన్స్‌లో స్వగ్రామానికి గురువారం తీసుకరాగా సుమారు 300 మంది ప్రజాసంఘాల నాయకులు, గ్రామస్థులు అంబేద్కర్ విగ్రహం వద్ద అందోళన చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు మల్లారపు అరుణ్‌కుమార్, ఈశంపల్లి కొమురయ్య డిమాండ్ చేశారు. మృతదేహంతో కొద్దిసేపు నినాదాలు చేస్తూ అందోళన నిర్వహించారు. అక్కడే ఉన్న స్థానిక ఎస్ఐ ఎల్లాగౌడ్ యువకుడి కుటుంబసభ్యులు, గ్రామస్థులతో మాట్లాడి పోస్టుమార్టం నివేదిక అధారంగా బాధితులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో అందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని ఇంటికి తరలించి పోలీస్ బందోబస్తు మధ్య అంత్యక్రియలు నిర్వహించారు.

నలుగురు శిశువుల దత్తత

కరీంనగర్ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని కరీంనగర్ శిశుగృహంలో పెరుగుతున్న నలుగురు శిశువులను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిల్లలు లేని దంపతులకు దత్తత ఇచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఇద్దరికి మగ, ఇద్దరికి ఆడ శిశువులను దత్తతగా ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలని అన్నారు. ఇందుకోసం జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం, భగత్‌నగర్, కరీంనగర్‌లో సంప్రదించాలని సూచించారు. రక్త సంబంధీకుల నుంచి చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలనుకునే వారు కూడా ఈ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, డిసిపివో ఫర్వీన్, పివో తిరుపతి, శిశు గృహ మేనేజర్ తేజస్వీ, ఔట్ రీచ్ వర్కర్ రమేశ్, సోషల్ వర్కర్ రాజేశ్ పాల్గొన్నారు.

● బాల్య వివాహ్ ముక్త్ భారత్ పోస్టర్ ఆవిష్కరణ :

బాల్య వివాహ్ ముక్త్ భారత్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్కరించారు. గురువారం కలెక్టరేట్ సమావేశమందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 10 వరకు జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలన ప్రచారకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేయాలని బాల్య వివాహాల నిర్మూలన అధికారులుగా ఉన్న ఆర్డీవో, తహసీల్దార్లు, సీడీపీవోలను ఆదేశించారు.


రాష్ట్ర స్థాయి క్రీడల ఏర్పాట్లను పరిశీలించిన డీఈవో

హుజూరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో శుక్రవారం నుంచి జరిగే రాష్ట్ర స్థాయి (ఎస్‌జీఎఫ్) అండర్-14 బాలుర, బాలికల హాకీ క్రీడలు జరిగే ఏర్పాట్లను జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో పీఈటీలు వేణుగోపాల్, సారయ్య, రవికుమార్, భాగ్యలక్ష్మి, అనిల్, శ్రీనివాస్, రేణుక, శేఖర్ పాల్గొన్నారు.

ఆటల్లో ఆణిముత్యాలు



● వాలీబాల్ క్రీడల్లో జూలపల్లి విద్యార్థుల సత్తా.. ● రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు..



జూలపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు వాలీబాల్ క్రీడలో సత్తా చాటుతున్నారు. మండల కేంద్రానికి చెందిన శ్రునిక్ అనే విద్యార్థి 2021లో పాఠశాలలో చదువుతున్న సమయంలో వాలీబాల్ సబ్‌జూనియర్ విభాగంలో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచాడు. అలాగే గత ఏడాది మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన చక్రినాథ్‌గౌడ్ అనే విద్యార్థి అండర్ 17, శివక్రిష్ణ అనే విద్యార్థి అండర్ 14 విభాగంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడాపోటీల్లో పాల్గొని ప్రతిభ చాటుకున్నారు. మండలానికి చెందిన మరికొంత మంది యువకులు వాలీబాల్ క్రీడలో రాణిస్తుండడంతో వారి తల్లిదండ్రులు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రోత్సా హం అందిస్తే మరికొందరు విద్యార్థులు మరిన్ని విజయాలు సాధిస్తారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతా..

టి. సురేష్, వ్యాయామ ఉపాధ్యాయులు

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు వాలీబాల్ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించి మండ లానికి పేరు మంచి గుర్తిం పు తెస్తుండడం వారి తల్లిదండ్రులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులుగా మాకు సంతోషంగా ఉంది. రాబోయే రోజుల్లో మరికొందరు విద్యార్థుల ను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాను.


సబ్‌జూనియర్ విభాగంలో జాతీయస్థాయిలో రాణించిన శ్రునిక్, రాష్ట్ర స్థాయిలో రాణించిన శివక్రిష్ణ, చక్రినాథ్‌గౌడ్

క్రికెట్‌లో రాణిస్తున్న రామగుండం విద్యార్థి

అంతర్గాం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రామగుండం పట్టణంలోని 20వ డివిజన్ ఏరియాకు చెందిన మహమ్మద్ తౌఫిక్ క్రికెట్‌లో రాణిస్తున్నాడు. గోదావరిఖనిలోని మైనారిటీ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు ప్రోత్సాహంతో తౌఫిక్ నిజామాబాద్, వరం గల్‌లో జరిగిన పోటీల్లో అండర్-14 విభా గంలో ప్రతి భ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడు. అనంతరం హర్యానా, గోవా రాష్ట్రాలలో జరిగిన పోటీల్లోనూ రాణించి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. 2022 నేపాల్‌లోని పొక్రా స్టేడియంలో ఆడి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. ప్రస్తుతం తౌఫిక్ ఐటీఐ చదువుతున్నాడు.




నేపాల్‌లో తౌఫిక్ అందుకున్న ప్రశంసా పత్రం

వేధింపులకు పాల్పడ్డ ప్రభుత్వ ఉపాధ్యాయుడి సస్పెన్షన్

జగిత్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని ఓ మండలానికి చెందిన ప్రభుత్వ పాఠశాల మహిళా ఉపాధ్యాయురాలిపై వేధింపులకు పాల్పడిన వ్యవహారంలో అదే పాఠశాలకు చెందిన బాధ్యుడైన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాధికారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న తనపై అదే పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయుడు వేధింపులకు పాల్పడుతున్నాడని మూడు రోజుల క్రితం బాధితురాలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. సంఘటనపై విచారణ జరపాలంటూ ఉన్నతాధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతోపాటు డీఈవో సైతం విచారణ చేసి వివరాలను సేకరించారు. ఉపాధ్యాయురాలిని వేధింపులకు పాల్పడ్డట్లు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో సదరు ప్రభుత్వ పాఠశాల సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బదిలీ

భగత్‌నగర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రీజియన్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత హైదరాబాద్ రీజినల్ మేనేజర్‌గా బదిలీ అయ్యారు. రంగారెడ్డి రీజియన్‌లో డిప్యూటీ రీజినల్ మేనేజర్‌గా పనిచేస్తున్న బిరాజు పదోన్నతిపై కరీంనగర్ రీజినల్ మేనేజర్‌గా నియమితులయ్యారు. కరీంనగర్ జోన్ ఈడీగా పనిచేస్తున్న మునిశేఖర్ హైదరాబాద్ బస్‌భవన్‌కు బదిలీ అయ్యారు. సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఖుస్రోషాఖాన్ కరీంనగర్ ఈడీగా పదోన్నతిపై బదిలీ అయ్యారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థుల ధర్నా


ధర్నా చేసున్న విద్యార్థులు

తంగళ్లపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వసతి గృహంలో సరైన వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులోని బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల ప్రధాన ద్వారం ఎదుట విద్యార్థులు ధర్నాకు దిగారు. అధిక సంఖ్యలో వసతి గృహంలో విద్యార్థులను చేర్చుకోవడాన్ని నిరసిస్తూ గురువారం విద్యార్థులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ హాస్టల్‌లో లెక్కకు మించి విద్యార్థులను చేర్చుకోవడంతో తాము హాస్టల్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. అధికారులు స్పందించి హాస్టల్ కష్టాలను తీర్చాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై కళాశాల అసోసియేట్ డీన్ శ్రీదేవిని వివరణ కోరగా విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే కళాశాలలో చదువుకుం టున్న విద్యార్థినులను చేర్చుకున్నట్లు తెలిపారు. విద్యార్థినుల రక్షణ కోసం తాత్కాలికంగా వసతి గదులు కేటాయించినట్లు తెలిపారు. విద్యార్థినుల భద్రతా చర్యల్లో భాగంగా తప్పనిసరిగా హాస్టల్లో చేర్చుకోవాల్సి వచ్చిందన్నారు. త్వరలోనే విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు

వెల్గటూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం స్తంభంపల్లి, పాషిగామ గ్రామాల మధ్యన వరంగల్- రాయపట్నం రాష్ట్ర రహదారిపై గురువారం ఆరు ఆటో ఢీ కొన్న సంఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం స్తంభంపల్లి, పాషిగామ గ్రామాల మధ్య ఎదురెదురుగా వస్తున్న కారు, ఆటో ఢీకొట్టుకున్నాయి. ఈ సంఘటనలో ఆటో నుజ్జు నుజ్జు అయింది. ఆటోలో ప్రయాణిస్తున్న మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన ఇందారపు కిరణ్, మేడి శ్రీధర్, మేడి సతీష్, గోపతి కిషోర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. హుటా హుటిన క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాటన్ పరిశ్రమపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలి


మాట్లాడుతున్న ఏఐఎఫ్‌టీయూ(న్యూ)రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశం

సిరిసిల్ల టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కాటన్ పరిశ్రమపై దృష్టి పెట్టి కార్మికులకు ఉపాధి కల్పించాలని ఏఐఎఫ్‌టీయూ(న్యూ)రాష్ట్ర అధ్యక్షుడు మోడం మల్లేశం అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం శాంతినగర్ ఆదర్శ పద్మశాలి సంఘం భవనంలో సిరిసిల్ల సైజింగ్ వర్కర్స్ యూనియన్(ఏఐఎఫ్‌టీయూ) జిల్లా సర్వసభ్య సమావేశం యూనియన్ జిల్లా అధ్యక్షుడు వల్లాల కిషోర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో అనుబంధ పరిశ్రమ సైజింగ్ కార్మికులు ఉపాధిలేక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం బతుకమ్మ చీరలపైనే శ్రద్ధ చూపడంతో కాటన్, పాలిస్టర్, సైజింగ్, డైయింగ్ పరిశ్రమలు కుదేలై ఉపాధి లేక కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కాటన్ పరిశ్రమపై దృష్టి సారించి ఆర్డర్లు ఇచ్చి పరిశ్రమతో పాటు కార్మికులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం, తెలంగాణ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, బి రవీందర్, సైజింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలిగేటి రాము, సహాయ కార్యదర్శి కూరపాటి సతీష్, నాయకులు కొమురయ్య, యూసుఫ్, మల్లేశం, చంద్రయ్య పాల్గొన్నారు.

జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు విద్యార్థి



షేక్ అఫాన్‌ను అభినందిస్తున్న ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి

కరీంనగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి అండర్-19 కేజీఎఫ్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు జిల్లా కేంద్రంలోని ట్రినిటీ జూనియర్ కళాశాల విద్యార్థి షేక్ అఫాన్ ఎంపికయ్యాడు. ఈ నెల 22న హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్-19 జూనియర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విశేష ప్రతిభచాటి బంగారు పతకం సాధించిన షేక్ అఫాన్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని ట్రినిటీ కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి అతనికి పుష్పగుచ్ఛాన్ని, ప్రశంసా పత్రాన్ని అందించి అభినందించారు. ట్రినిటీ సంస్థల వ్యవస్థాపకుడు దాసరి మనోహర్‌రెడ్డి ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీహార్ రాష్ట్రంలోని బుద్ధగయాలో ఈ నెల 29, 30, డిసెంబర్ 1న జరిగే జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో విశేష ప్రతిభచాటిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు పి శ్రీచరణ్ పటేల్, టి రణవీర్ రాజ్, పి సహన్, పి శ్రీహర్ష, వి యుక్తలు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఉమ్మడి జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ ముష్రాజిల్ తెలిపారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు..

భీమారం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలో అథ్లెటిక్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని గోవిం దారం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన ఆకునూరి అశ్విత, భూపతి అవంతిక, తుమ్మ హర్షవర్ధన్‌లు జిల్లా స్థాయి జావెలన్ త్రో, 600 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అష్పాఖ్ హుస్సేన్, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రశాంత్ అభినందించారు.

రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలకు సైనిక్ స్కూల్ విద్యార్థులు

చొప్పదండి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రుక్మాపూర్ సైనిక్ స్కూల్ విద్యార్థులు రిశ్వంత్, హర్షిత్, తేజేశ్వర్ జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలలో ప్రతిభ చాటి డిసెంబరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను స్కూల్ డైరెక్టర్ కల్నల్ కేసీ రావు, ప్రిన్సిపాల్ శ్రీకాళహస్తి, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, ప్రమోద్ రాజు తదితరులు అభినందించారు.


ధర్మపురిలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు


వేములవాడలో రాజన్నకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఆలయాల్లో భక్తుల రద్దీ

- ధర్మపురిలో 27వ రోజు గోదావరి హారతి

- వేములవాడలో దీపాలు వెలిగించిన మహిళలు

ధర్మపురి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి, వేములవాడ ఆగయాల్లో కార్తీకమాసం సందర్భంగా గురువారం సందడి నెలకొంది. ధర్మపురి క్షేత్రంలో గురువారం భక్తుల సంఖ్య పెరిగింది. లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. గోదావరి నదిలో కార్తీక స్నానాలు చేసిన భక్తులు, గోదావరి పౌరోహితులచే సంకల్పాది పూజలు చేయించుకున్నారు. మహిళలు భక్తి శ్రద్ధలతో పూజించి దొప్పలో కార్తీక దీపాలు ఉంచి, గోదావరి నదిలో వదిలారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించారు. స్వామి వారలకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ నిత్య పూజలు, అభి షేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 27 వ రోజు గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, వెంటరాగా గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం విశేష పూజలు నిర్వహించి నదీ మాతకు హారతి ఇచ్చారు.

రాజన్న ఆలయంలో ..

వేములవాడ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించి ఆయా క్యూలైన్ ద్వారా ఆలయంలోకి చేరుకున్నారు. రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుని తరించారు. ఆలయ ఆవరణలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు.

● వేములవాడ కల్చరల్: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న సామూహిక కార్తీక దీపోత్సవం వైభవంగా కొనసాగుతోంది. గురువారం రాత్రి ఆలయ కళావేదికలో సామూహిక కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని ఆలయ సూపరింటెండెంట్ వరి నర్సయ్య జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులతో పాటుగా పట్టణవాసులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కార్తీక మాసం సందర్భంగా భక్తులు ఓం, స్వస్తిక్, లింగాకృతిలో పూలతో అందంగా అలంకిరించి దీపాలను వెలిగించారు. కాగా కళావేదికలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


రాజన్న ఆలయంలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు

రాంగ్ పార్కింగ్‌పై పోలీసుల కొరడా



లాక్‌చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సిరిసిల్ల క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలో వాహనాల రాంగ్ పార్కింగ్‌పై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. ట్రాఫిక్ ఎస్‌ఐ రమేశ్ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా, గాంధీచౌక్, నేతన్నచౌక్ తదితర ప్రాంతాల్లో రహదారులపై పార్క్‌చేసిన వాహనాలకు లాకింగ్ చేశారు. ప్రతీ వాహనానికి జరిమానా విధించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో దివ్యాంగుల ప్రతిభ



అవార్డు అందుకుంటున్న క్రీడాకారులు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వికలాంగుల క్రీడల పోటీల్లో జగిత్యాల జిల్లాకు చెందిన వికలాంగ క్రీడాకారులు సత్తాచాటారని జిల్లా సంక్షేమ అధికారి బోనగిరి నరేష్ తెలిపారు. కోరుట్లకు చెందిన రజినీ అనే దివ్యాంగురాలు క్యారం పోటీల్లో రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి గెలుచుకోగా, వెల్లటూర్‌కు చెందిన పవన్‌కళ్యాణ్ రన్నింగ్, షాట్‌పుట్‌లో ద్వితీయ బహుమతి పొందినట్లు పేర్కొన్నారు. వయోవృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ చేతుల మీదుగా బహుమతులు పొందారని తెలిపారు. క్రీడాకారులను కలెక్టర్ సత్యప్రసాద్ అభినందించారు.

బోనాల ఉత్సవాల్లో గుండెపోటుతో వ్యక్తి మృతి



గంగాధర్(ఫైల్)

రాయికల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలో బోనాల ఉత్సవాల్లో విషాదం నెలకొంది. గురువారం గ్రామంలో పోచమ్మ బోనాలు నిర్వహిస్తుండగా పోతురాజు నృత్యం చేస్తున్న బోదనపు గంగాధర్ (58) అకస్మాత్తుగా గుండెపోటుకు గురయ్యాడు. స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.







"హత్య జరిగింది.. నిందితులు పారిపోయారు. క్లూస్ టీం వచ్చింది.. ఎటువంటి ఆధారాలు లభించలేదు.. ఈ సమయంలో వస్తుంది.. డాగ్‌స్క్వాడ్.. సంఘటన స్థలాన్ని పరిశీలించి వాసన పసిగట్టి నేరస్థులు ఏ మార్గంలో వెళ్లారు.. ఎక్కడెక్కడ తిరిగారు.. లాంటి ఆధారాలను విచారణ అధికారులకు అందజేస్తుంది. ఇలా కీలక కేసులలో పోలీసులకు సహాయం చేస్తున్న పోలీస్ డాగ్స్‌పై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.."

పవర్ ఫుల్ పోలీస్ డాగ్స్

● ఎనిమిది నెలల కఠోర శిక్షణ ● శాంతి భద్రతల రక్షణలో తమదైన పాత్ర

కరీంనగర్ క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీస్ డాగ్ స్క్వాడ్.. అంటే ప్రతి ఒక్కరికీ ఆసక్తి ఉంటుంది. పోలీసులకు నేరాల ఛేదనలో సహాయకారిగా ఉండే జాగిలాలకు ఎనిమిది నెలల కఠిన శిక్షణ ఇస్తారు. రాష్ట్రంలో హైదరాబాద్‌లోని మొయినా బాద్‌లో పోలీస్ డాగ్స్‌కు శిక్షణ ఇస్తున్నారు. తమకు అవసరమైన జాగిలాల గురించి ఆయా యూనిట్ల అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపిస్తారు. ఇంటలిజెన్స్, సెక్యూరిటీ వింగ్ అధికారుల ఆధ్వర్యంలో ఆయా యూనిట్లకు కావాల్సిన కుక్కలను (స్నిఫర్ లేదా ట్రాకర్) తీర్చిదిద్దేందుకు మూడు నెలల వయస్సు కలిగిన కుక్క పిల్లలను అందుబాటులోని కేంద్రాల్లో కొనుగోలు చేస్తారు. వాటిని హ్యాండ్లింగ్ చేసేందుకు ఏఆర్ కానిస్టేబుల్స్‌ను ప్రదిపాదిత అధికారులు హైదరాబాద్‌కు పంపిస్తారు. ఒక్కో హ్యాండ్లర్‌కు ఒక్కో జాగిలం బాధ్యతను అప్పచెబుతారు.

మొదటి నెలలో గ్రూమింగ్, వేళకు ఆహారం ఇవ్వడం ద్వారా హ్యాండ్లర్ పై కుక్కకు ప్రేమ, ఆకర్షణ కలిగేలా చేస్తారు. ఈ సమయంలో కుక్క తన యజమానిని గుర్తించే స్థాయికి చేరుతుంది. నాలుగో నెల నుంచి ఐదో నెల వరకూ విధేయత, కూర్చోవడం, నిలబడడం, పడుకోవడం, సెల్యూట్ చేయడం వంటివి నేర్పిస్తారు. ఆ తర్వాత వాటికి ఉన్నతాధికారుల సమక్షంలో పరీక్ష నిర్వహిస్తారు. వీటిలో ఉత్తీర్ణత పొందిన వాటికి ఐదు నెలల పాటు బాంబులను కనిపెట్టడం, లేదా నిందితుల ఆచూకీని కనిపెట్టడం, ఇతర అంశాల్లో పూర్తి స్థాయి శిక్షణనిస్తారు.

జాగిలాలను హ్యాండ్లర్లు కంటికిరెప్పలా చూసుకుంటారు. పొరపాటున ఒక కుక్క ఏదైనా కారణంతో మృతి చెందినట్లయితే హ్యాండ్లర్‌దే పూర్తి బాధ్యత ఉంటుంది. సంబంధిత హ్యాండ్లర్‌పై ఉన్నతాధికారులు కఠినచర్యలు తీసుకుంటారు. ఒక్కోసారి ఉద్యోగం నుంచి ఉద్వాసన పలకడంతోపాటు చట్టపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది.

ప్రత్యేక సౌకర్యాలు

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో పోలీసు డాగ్స్‌కు ప్రత్యేకంగా గదులను ఏర్పాటు చేశారు. వేసవి కాలంలో రక్షణ కోసం కూలర్లను కూడా ఏర్పాటు చేశారు. ప్రతి రోజు వేడి నీళ్లతో స్నానం చేయిస్తారు. ఒక్క పూటకు 250 గ్రాములు వంతున రెండు పూటలు రాయల్‌కెనాన్ ప్రత్యేక ఫీడ్‌ను ఆహారంగా అందిస్తారు. ఇందులో చికెన్, మటన్ మిశ్రమం ఉంటుంది.

మావోయిస్టు ప్రభావం ఉన్నప్పుడు..

జిల్లాలో గతంలో మావోయిస్టుల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న సమయంలో పోలీసు సిబ్బంది ప్రాణాలు కాపాడుకోవటానికి పోలీస్ డాగ్స్ కీలకంగా పనిచేశాయి. అటవీ ప్రాంతాల్లో నక్సల్స్ ఎక్కడ మందు పాతరలు పెట్టారో... ఎక్కడ జిలెటిన్‌స్టిక్స్‌ను భద్రపరిచారో కనుక్కోవడంలో డాగ్స్ కీలక పాత్రను పోషించాయి. అనంతరం పలు కేసు ఛేదనలో తమ వంతు పాతను పోషిస్తున్నాయి. జిల్లాలో ప్రస్తుతం టైగర్, డాని, రాంబో, మిక్కీ, లియోలు, టైసన్ అనే 6 జాగిలాలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో మూడు ట్రాకర్స్ రెండు ఎక్స్‌ప్లోజివ్ స్నిఫర్ డాగ్స్, ఒకటి నార్కోటిక్ స్నిఫర్ డాగ్ వీటికి ఆరుగురు శిక్షణ పొందిన ఏఆర్ కానిస్టేబుల్స్ హ్యాండ్లర్స్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.



కేసుల ఛేదనలో మేటి

ఉమ్మడి జిల్లాలోని మారు మూల అటవీ ప్రాంతంలో నక్సల్స్ ఏరివేతకు కూంబింగ్‌కు వెళ్లిన అప్పటి పోలీసులకు ఒక అనుమానిత ప్రాంతంలో పేలుడు పదార్థాలను పోలీసుడాగ్ పసిగట్టడంతో పెను ప్రమాదం తప్పింది. - జిల్లాలో ఓ మహిళను గుర్తుతెలియని గొంతు నులిమి హత్య చేసి ఒంటిపైన ఉన్న బంగారు ఆభరణాలు ఎత్తుకు పోయారు. వెంటనే రంగంలోకి దిగిన డాగ్‌స్క్వాడ్ సంఘటనా స్థలంలో వాసన పసిగట్టిన డాగ్ (విక్కీ) కొంత దూరంలో ఉన్న నిందితుడి ఇంటకి వెళ్లి బంగారు ఆభరణాలు దాచిపెట్టిన చోటును చూపించింది. దీంతో పోలీసులు ఇంటి యజమానిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. ఇలా జిల్లాలో ఎన్నో కేసులను డాగ్ స్క్వాడ్ సహాయంతో పోలీసులు ఛేదించారు.

ఎనిమిదేళ్లపాటు మాతోనే ఉంటాయి..

ఎలుక శంకర్, లియోడాగ్ హ్యాండ్లర్



నాలుగు నెలల వయస్సు నుంచి ఎనిమిదేళ్ల వరకు మాతోటే జాగిలం చనువుగా ఉంటుంది కాబట్టి మా కుటుంబంలో ఒక సభ్యుడిగానే భావిస్తాం. నాలుగు నెలల నుంచి హ్యాండ్లర్‌తో ఎనిమిది నెలలపాటు కఠోర శిక్షణ ఉంటుంది. శిక్షణ అనంతరం ఏడాది వయస్సున్న జాగిలాన్ని హ్యాండ్లర్‌తోపాటు జిల్లాకు కేటాయిస్తారు. హ్యాండ్లర్ బదిలీ అయితే జాగిలం కూడా బదిలీ అవుతుంది. ఒక్కసారి జాగిలానికి హ్యాండ్లర్‌తో హాండ్లర్‌తో శిక్షణ ఇస్తే దాని ప్రాణం ఉన్నంతవరకు అతడితోనే ఉంటుంది. వేరొకరి మాట వినదు. మత్తు పదార్థాలు, ఎక్స్‌ప్లోజివ్స్ వ్యక్తుల చెమట వాసనను చూపిస్తూ జాగిలాలకు నెలకు ఒకసారి ట్రైనింగ్‌లో పరీక్షలు నిర్వహిస్తుంటాం.

ఉద్యోగ విరమణ

సాధారణంగా శునకాల జీవిత కాలం 12 నుంచి 14 సంవత్సరాలు. పోలీస్ జాగిలాలకు ఎనిమిదేళ్లు నిండగానే ఉద్యోగ విరమణ చేయిస్తారు. ఎందుకంటే ఈ వయసుకు వచ్చే సరికి జాగిలాలలో వాసన పసిగట్టే శక్తి తగ్గిపోతుంది. పేలుడు పదార్థాలను గుర్తించే జాగిలాలు సాధారణం కంటే 40 రెట్లు ఎక్కువగా వాసన పీల్చుతాయి. పదవీ విరమణ చేసిన పోలీస్ జాగిలాలను వాటి హ్యాండ్లర్స్‌కు అప్ప గించేవారు. ఒక వేళ వీటిని పెంచుకునేందుకు వారు సమ్మతించకపోతే జంతు ప్రేమికులు ముందుకు వస్తే పోలీసు ఉన్నతాధి కారులు అన్ని విధాల పరిశీలించాక వారికి అప్పగించే వారు. జంతు ప్రేమికులకు అప్పగించిన రెండు నెలల వరకు వాటి బాగోగులను, యజమానితో జాగిలాలు వ్యవహరిస్తున్న తీరును వాటి హ్యాండ్లర్లు తప్పనిసరిగా పరిశీలించేవారు.

ప్రస్తుతం పోలీసుశాఖనే జాగిలాల సంరక్షణ బాధ్యతను తీసుకుని మరణించేవరకు పోషిస్తోంది. శోధనకు వెళ్లిన సమయంలో పాలు, కొబ్బరినీరు అందిస్తారు. ప్రతి రోజు 45 నిమిషాల వాకింగ్, 30 నిమిషాల ఎక్సైర్‌సైజ్ తప్పనిసరిగా నిర్వహిస్తారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జీవన్‌రెడ్డి

- అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించిన టీపీసీసీ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)



పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి సిట్టింగ్ ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి పేరునే తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) మళ్లీ ప్రతిపాదించింది. గురువారం గాంధీభవన్‌లో కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనేతలతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఈ నాలుగు జిల్లాల పరిధి కలిగిన ఎమ్మెల్సీ స్థానానికి మార్చిలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో అభ్యర్థిగా ఎవరి పేరును ప్రతిపాదించాలనే దానిపై చర్చ జరిగింది. పలువురు నేతలు కాంగ్రెస్ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నా సిట్టింగ్ ఎమ్మెల్సీ సీనియర్ నేత టి జీవన్‌రెడ్డినే తిరిగి ఆ స్థానంలో పోటీకి నిలపాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని వెల్లడించారు. హై కమాండ్‌దే తుది నిర్ణయం అని చెబుతూనే జీవన్‌రెడ్డి పేరును ప్రతిపాదిస్తూ ఈ సమావేశంలో తీర్మానం చేశారు.

● అధిష్ఠానానికి వెళ్లిన ఒకే ఒక్కపేరు

కాంగ్రెస్ అభ్యర్థిత్వాన్ని విద్యావేత్త, అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ వి నరేందర్‌రెడ్డి, ప్రసన్న హరికృష్ణ, మాజీ ఎమ్మెల్సీలు ఆర్ సత్యనారాయణ, నర్సారెడ్డి, వెలిచాల రాజేందర్‌రావు తదితరులు ఆశించారు. కాంగ్రెస్ వ్యూహకర్త సునీల్ కనుగోలు బృందం ఈ అభ్యర్థులపై నియోజకవర్గ పరిధిలోని 42 అసెంబ్లీ సెగ్మెంట్లలో సర్వే నిర్వహించి అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి, ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ పేర్లను సిఫారసు చేసిందని ప్రచారం జరిగింది. ప్రస్తుతం టీపీసీసీ ఆధ్వర్యంలో జరిగిన పార్టీ ప్రజాప్రతినిధులు, నేతల సమావేశం మాత్రం సిట్టింగ్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేరును మాత్రమే మళ్లీ సిఫారసు చేసింది. పార్టీ అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

పెన్షనర్లను ఆదాయపు పన్ను నుంచి మినహాయించాలి

- పెన్షనర్ల రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్



మాట్లాడుతున్న హరి అశోక్‌కుమార్

కోరుట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లకు విధించిన ఆదాయపు పన్ను నుంచి మినహాయించాలని పెన్షనర్ల రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో పెన్షనర్ల సంఘ సర్వసభ సమావేశంలో పాల్గొన్ని మాట్లాడారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కేంద్రంలో పెన్షనర్లకు ఆదాయపు పన్ను రద్దు చేయాలని పార్లమెంట్ శీతాకాల సమావేశంలో గౌరవ భృతిగా ప్రతి నెల రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్‌పై ఆదాయపు పన్ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదాయపు పన్ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేసేందుకు తీర్మానం చేసినట్లు సంఘ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాజుల నర్సయ్య, పబ్బా శివానందం, గంటేడి రాజ్ మోహన్, నల్ల లక్ష్మీనారాయణ, ఎండి సైపొద్దిన్, హన్మంత రెడ్డి, వేల్పుల ప్రకాశ్ రావు, చిటుక గంగారాం, సబిత రాజయ్య, మల్కయ్య, లక్ష్మీకాంతం, శ్రీరాములులతో పాటు పలువురు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రహదారి విస్తరణ కొలతలు



వేములవాడలో ఓ దుకాణంలో కొలతలు వేస్తున్న అధికారులు

వేములవాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని ప్రధాన రహదారి విస్తరణ కోసం కొలతల సేకరణ ప్రక్రియ కొనసాగుతోంది. రెవెన్యూ, ఇంజనీరింగ్, మున్సిపల్, సర్వే విభాగాలకు చెందిన 16 మందితో కూడిన నాలుగు బృందాలు రెండురోజులుగా ప్రధాన రహదారిలోని నివాసాలు, దుకాణాల కొలతలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. గతంలో వేసిన కొలతలు అంచనాలతో సరి చూసుకుంటూ సర్వే నిర్వహిస్తున్నారు. వారం రోజుల్లో కొలతల సేకరణ మొత్తం ప్రక్రియ పూర్తి చేసి రెవెన్యూ అధికారులకు నివేదిక సమర్పిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు నవీన్‌కుమార్, మధు, సర్వేయర్లు మధుసూదన్, చామంతి, ఏఈలు గోవింద్, నర్మద, మయూరి తదితరులు ఉన్నారు.

గోదావరికి మహా హారతి



గోదావరినదికి హారతి ఇస్తున్న ఉత్సవ సమితి

కళ్యాణ్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద పుష్కరఘాట్ నుంచి గోదావరినదమ్మ తల్లికి బుధవారం రాత్రి నక్షత్ర హారతి ఇచ్చి సారె సమర్పించారు. ఈ కార్యక్రమం హారతి ఉత్సవ సమితి రాష్ట్ర కోకన్వీనర్ క్యాతం వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. క్యాస జయశ్రీ, ఒజ్జల వెంకటేశ్వర్లు, వైద్యులు లక్ష్మీవాణి, రమ్య, విశ్వహిందు పరిషత్ నాయకులు ఇస్సంపల్లి వెంకన్న, కృష్ణమూర్తి, గుండా మంజుల, భాగ్యలక్ష్మి, రజిత, కృష్ణప్రియ, పద్మ, వీరేశం, అశోక్‌రావు, రమేష్ పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 11 మందికి జరిమానా, జైలుశిక్ష

పెద్దపల్లిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 11 మందిని గురువారం పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ కోర్టులో హాజరుపరిచారు. జడ్జి మంజుల విచారించి రూ.11వేల 400 జరిమానా విధించారు. సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామానికి చెందిన నీరెళ్లి సతీష్‌కు మూడు రోజులు, మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేటకు చెందిన మొగుళ్ల సంతోష్‌కు రెండు రోజులు, పెద్దపల్లి పట్టణం ఉదయ్‌నగర్‌కు చెందిన ఎలుకపల్లి సతీష్‌కు రెండు రోజులు జైలుశిక్ష విధించారు.

హెల్మెట్ ధరించి.. అవగాహన కల్పించి..

- రోడ్డు భద్రత నియమాలపై విద్యార్థుల ప్రదర్శన



హెల్మెట్లు ధరించి అవగాహన ర్యాలీ తీస్తున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం హెల్మెట్ ధరించి రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. గ్రామ శివారులోని పాఠశాల నుంచి కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారి గుండా తహసీల్, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్, కొత్త, పాత బస్టాండుల మీదుగా అవగాహన ప్రదర్శన నిర్వహించారు. తమ ఆటాపాటల ద్వారా చైతన్యం నింపారు. ప్రతి ఒక్కరూ విధిగా నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు అహల్యబాయి కృషి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అప్పాల ప్రసాద్, నాయకులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అహల్యబాయి హోల్కర్ 18వ శతాబ్దం లో మహిళా సాధికారత కోసం ఎనలేని కృషి చేశారని అఖిల భారత సమరసతా కళా విభాగం కన్వీనర్ అప్పాల ప్రసాద్ అన్నారు. అహల్యబాయి హోల్కర్ జయంతి వేడుకలను పురస్కరించుకొని సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో ముద్రించిన ఆమె జీవిత చరిత్ర పుస్తకాన్ని అప్పాల ప్రసాద్, నాయకులు గురువారం పట్టణంలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్యుడు సురేంద్రబాబు, సమరసతా వేదిక సభ్యులు భాస్కర్, రవి, రమేష్‌చారి, సంతోష్, పవన్, కరుణాకర్ పాల్గొన్నారు

ప్రమాదకరంగా మూలమలుపులు

- రాకపోకలకు వాహనదాల ఇబ్బందులు



కుస్థాపూర్ శివారులో ప్రమాదకర మూలమలుపులు



ప్రమాదకర మూలమలుపు

మల్లాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలంలోని ఆయా గ్రామాల శివారులో పలుమూల మలుపులు ప్రమాదకరంగా మారాయి. రహదారికి ఇరువైపులా ములుపులు అందులోనూ రహదారికి ఇరువైపులా మొక్కలు పెరిగి ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరికి వచ్చేంతవరకు తెలియక పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరి కొందరు మూల మలుపులపై అవగాహన లేక ప్రమాద బారినపడి ఆసుపత్రుల పాలవుతున్నారు. ముత్యంపేట, కుస్థాపూర్, రాఘవుపేట, గుండంపల్లి, రేగుంట, ధాం రాజుపల్లి, వివిరావుపేట, తదితర గ్రామాల శివారులో ఉన్న మూల మలుపులపై అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

గ్రామాల్లో కోతుల స్వైర విహారం

- మనుషులపై దాడి - ఇళ్లపై గూనపెంకులు ధ్వంసం - భయబ్రాంతులకు గురువుతున్న ప్రజలు



సైదాపూర్‌లో వీధుల్లో తిరుగుతున్న వానరాలు

సైదాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాలలో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. మనుమలపై దాడి చేస్తుండడంతో ప్రజలు భయబ్రాంతులకు గురవుతు న్నారు. వానరాలు గుంపులు గుంపులుగా గ్రామాల్లో చేరి ఇళ్లపై గూన పెంకులు ఊడబెరుకుతున్నాయి. నీళ్ల పైపులను విరగ్గొడుతున్నాయి. తలుపు తీసి ఉంటే చాలు.. ఇళ్లలోకి చేరి వంట సామగ్రిని చిందవందర చేస్తున్నాయి. పత్తి, మొక్క జొన్న పంటలను నాశనం చేస్తున్నాయి. పత్తి కాయలు తెంపి పడవేస్తూ, మొక్కజొన్న కంకులు విరుస్తూ నష్టం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్లపై ఉంటూ అకస్మాత్తుగా దాడి చేస్తున్నాయని, చిన్న పిల్లలను నమ్మి బయట వదిలే పరిస్థితి లేదని మహిళలు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కోతుల బాధ నుంచి రక్షించాలని కోరుతున్నారు.

● అధికారులు చర్యలు తీసుకోవాలి



మండల కేంద్రంతో పాటు చాలా గ్రామాల్లో కోతుల బెడద ఉంది. అవి చిన్నపిల్లలు, పెద్దవారు అని చూడకుండా దాడి చేస్తున్నాయి. కట్టె చేతులో లేకుండా బయటకు వెళ్లే పరిస్థితి లేదు. వానరాలు గుంపులు గుంపులుగా వచ్చి ఇళ్లలో చేరి భయబ్రాంతులకు గురి చేస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుని కోతుల బెడద నుంచి రక్షించాలి.

- గాదపాక కుమార్‌రాజా, సైదాపూర్

● గుట్టల ధ్వంసంతో జనాల్లోకి కోతులు

ఒకప్పుడు గుట్టలు చెట్లతో, పండ్లు ఫలాలతో పచ్చ గా ఉండేవి. కోతులతో పాటు అడవి జంతువులు ఆ గుట్టలను నివాసంగా చేసుకుని జీవించేవి. క్వారీలు ఏర్పరడడంతో చెట్లే కాదు.. గుట్టలూ కనుమరుగవుతున్నాయి. దీంతో అక్కడ నివసించే జీవులు చెల్లాచెదరైపోయాయి. కోతులు గ్రామాల్లోకి చేరి హంగామా చేస్తున్నాయి.

అక్షరంతో సమాజాన్ని మేల్కొలిపిన జ్యోతిబాపూలే



జ్యోతిబాపూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



హుజూరాబాద్‌లో జ్యోతిబాపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

● సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అక్షరమే ఆయుధమని మహిళా సమాజాన్ని మేల్కొల్పిన మహాత్ముడు జ్యోతిబాపూలే అని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. జ్యోతిబాపూలే వర్ధంతిని పురస్కరించుకొని గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంతో పాటు నగరంలోని శాతవాహన యూనివర్సిటీ పూలే విగ్రహం వద్ద కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్, జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోతు శ్రావణ్‌నాయక్, సిటీ ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగంపల్లి బాబు, కాంగ్రెస్ నాయకులు రామిడి రాజిరెడ్డి, ధన్నాసింగ్, వంగల విద్యాసాగర్, సాయిరి దేవన్న, రామిడి తిరుపతి రెడ్డి, పోరండ్ల రమేష్, గుండా మల్లేశం, బాలబద్రి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘాల ఆధ్వర్యంలో...

గణేశ్‌నగర్: మహాత్మా జ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా బీసీ సంఘాల ఆధ్వర్యంలో గురువారం శాతవాహన యూనివర్సిటీ వద్ద మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పూలే విగ్రహం వద్ద ఆధునీకరణ పనులు చేపట్టాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డికి బీసీ సంఘాల పక్షాన వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కెశిపెద్ది శ్రీధర్ రాజు, ఉమ్మడి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎన్నం ప్రకాష్,కరీంనగర్ జిల్లా అధ్యక్షులు నాగుల కనకయ్య గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, పెంట శ్రీనివాస్, రంగు సంపత్ గౌడ్ , మాదాసు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

● బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింగోజు శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గుంటి స్వరూప,బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎడ్ల ఉమ మహేశ్వర్,యువజన సంఘం జిల్లా కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాస్, మహిళ విభాగం నగర అధ్యక్షురాలు సంద్ర సరిత,బీసీ సంఘం నాయకులు శాతవాహన యూనివర్శిటీ వద్ద జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో ..

సుభాష్‌నగర్: బహుజన సమాజ్‌పార్టీ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబాపూలే 134వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. గురువారం నగరంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు మంద భాస్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్‌లు భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని విమర్శించారు. బహుజన ఉద్యమం వల్లనే భారత రాజ్యాంగం రక్షించబడుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి నిషాని రాంచంద్రం, కార్యదర్శి దొడ్డె సమ్మయ్య, మాతంగి అశోక్, జిల్లా ఇంచార్జీ కల్లెపల్లి రాజేందర్, అక్కి బాలకిషన్ పాల్గొన్నారు.

హుజూరాబాద్‌లో..

హుజూరాబాద్: పట్టణంలోని జమ్మికుంట రోడ్‌లో మహాత్మా జ్యోతిబాపూలే వర్ధంతి వేడుకలు గురువారం ప్రజా సంఘాలు, అంబేద్కర్ వాదులు, కాంగ్రెస్ పార్టీ, మున్సిపల్, పోలీసుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

నేడు దీక్షా దివస్

(5వ పేజీ తరువాయి)

ఒక్కోరోజు ఒక్కో రీతిలో జరుగుతున్న జనసమీకరణను చూసిన ప్రభుత్వ యంత్రాంగం కేసీఆర్ భవన్ చుట్టూ పోలీసులను మోహరించింది. 28న ఆయనను అరెస్టు చేయాలని ప్రయత్నాలు మొదలుపెట్టారు. అది సాధ్యం కాలేదు.. నవంబరు 29న ఉదయం 7 గంటలకు కేసీఆర్ ప్రెస్‌మీట్ పెట్టారు. నేను ఈ కరీంనగర్ నుంచి ఆమరణ నిరాహార దీక్షకు తరలి వెళ్తున్నా... తెలంగాణ వచ్చుడో... కేసీఆర్ సచ్చుడో... తెలంగాణ జైత్రయాత్రనా... కేసీఆర్ శవయాత్రనా... ఏదో ఒకటి తేలాలి... అంటూ బయటకు వచ్చారు. అప్పటికే పోలీసులు తమ వ్యూహాన్ని మార్చుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. కేసీఆర్ వెంట వాహనాల్లో వందలాది మంది తరలివెళ్లారు. కేసీఆర్ అల్గునూరు చేరే వరకు వేలాది మంది పోలీసులు సిద్దిపేటకు వెళ్లే దారిని మూసేశారు. అల్గునూరు చౌరస్తాలోనే కేసీఆర్ వాహనాన్ని అడ్డుకున్నారు. కేసీఆర్ వాహనం దిగి రోడ్డుపై కూర్చోగా ఆయనను అరెస్టు చేసి ఖమ్మం తరలించారు. కేసీఆర్‌ను ఖమ్మం సబ్ జైలుకు తీసుకవెళ్లారు. నాలుగురోజులపాటు అక్కడే ఉంచి ఆ తర్వాత నిమ్స్‌కు తరలించారు. నిమ్స్‌లో 7రోజులు ఉన్నారు. మొత్తం 11 రోజులు కేసీఆర్ దీక్షలో ఉన్నారు. డిసెంబరు 9న రాత్రి 11.30 గంటలకు కేంద్రహోంశాఖ మంత్రి చిదంబరం తెలంగాణపై ప్రకటన చేశారు. తర్వాత వెనక్కి తీసుకున్నా ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడడంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. కేసీఆర్ దీక్షకు పూనుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ దీక్షా దివస్ నిర్వహిస్తోంది.

గెజిటెడ్ ఆఫీసర్స్ జిల్లా కార్యవర్గం ఎన్నిక





కాశీచరణ్, అరవింద్‌రెడ్డి

సుభాష్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మడిపల్లి కాశీచరణ్, ప్రధాన కార్యదర్శిగా ఏ అరవింద్‌రెడ్డి, కోశాధికారిగా నాగరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం కరీంనగర్‌లోని టీఎన్‌జీవో ఫంక్షన్‌హాలులో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలురి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు.

గురుకుల కళాశాలలో వైద్య శిబిరం

కరీంనగర్ రూరల్, నవంబర్28(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల కళాశాలలో ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థినిలకు చామనపల్లి మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్, డా. మనోహర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్యాధికారులు కళాశాల వంట గదిని పరిశీలించి పరిశుభ్రమైన భోజనం అందించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డా.టి.మాలతి, వైస్ ప్రిన్సిపల్ డా.జి సమత, ఆఫీస్ సూపరిండెంట్ టి. సురేష్‌కుమార్, ఎస్ పద్మజ, వైద్యాధికారి డా.ఎం చైతన్య ఉన్నారు.

మాజీ ఎంపీ గొట్టె భూపతిని పరామర్శించిన పొన్నం



మాజీ ఎంపీ గొట్టె భూపతి, రాచకొండ సీపీ గొట్టె సుధీర్‌బాబులను పరామర్శిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ గొట్టెభూపతి సతీమణి, రాచకొండ పోలీస్‌కమిషనర్ గొట్టె సుధీర్‌బాబు తల్లి గొట్టె శాంత ఇటీవల మృతి చెందారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం కరీంనగర్‌లోని వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. గొట్టె శాంత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు మంత్రి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే మాజీ డీసీసీ అధ్యక్షుడు కె. హన్మంతరావు ఇటీవల మరణించగా ఆయన ఇంటికి వెళ్లిన మంత్రి పొన్నం ప్రభాకర్ హన్మంతరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కరీంనగర్‌లోని ఇటీవల పలువురు కాంగ్రెస్‌పార్టీ నాయకుల కుటుంబ సభ్యులు, ఇతరులు మరణించగా వారి ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, నాయకులు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, గడ్డం విలాస్‌రెడ్డి, వైద్యుల అంజన్‌కుమార్, ఎండీ తాజ్, ఎసే మోసిన్, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్,నవంబర్28(ఆంధ్రజ్యోతి): నగరంలో విద్యుత్ మరమ్మతులలో భాగంగా శుక్రవారం ఉదయం.10 గంటల నుంచి 11:30 వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్ ఏడీఈ, పంజాల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేయు ప్రాంతాలు వెంకటసాయి ఏరియా, వాటర్ వర్క్స్ సబ్‌స్టేషన్ ప్రభావిత ప్రాంతాలు పద్మశాలి వీధి, షా సాహెబ్ మహల్, పాత బజార్, తెలంగాణ చౌక్ ప్రాంతం, లక్ష్మీనగర్‌లోని కొంత భాగం, కమాన్ నుంచి హౌసింగ్ బోర్డ్ రోడ్డు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపటి నుంచి ఐఏఎల్ రాష్ట్ర ద్వితీయ మహాసభలు

భగత్‌నగర్; నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఈ నెల 30, డిసెంబర్ 1వ తేదీన హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించనున్న భారత న్యాయవాదుల సంఘం ఐఏఎల్ రాష్ట్ర ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలని ఐఏఎల్ జిల్లా నాయకులు బోనగిరి మహేందర్ ఒక ప్రకటనలో కోరారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఏఐఎల్)రాష్ట్ర ద్వితీయ మహాసభలు రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు న్యాయవాదులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

రేపు వేదభవనంలో లక్ష్మీనారాయణ కల్యాణం..

కరీంనగర్ కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా నగర శివారులోని వేదభవనంలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి లక్ష్మీనారాయణ కల్యాణ మహోత్సవం, దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు వికాసతరంగిణి జిల్లా అధ్యక్షుడు కె గౌతమరావు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై క్షేత్రస్థాయి అవగాహన

ఇల్లందకుంట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయం చేసే ఉత్తమ రైతు శ్రీకాంత్ వేసిన పంటను మల్లారెడ్డి వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థినిలు గురువారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు ప్రకృతి సేద్యం ద్వారా చేసే దేశీ విత్తనాల విశిష్టత గురించి రైతు శ్రీకాంత్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మానస, మిషా, నేహశ్రీయ, లిఖిత, నయని, మహిమ, నవనీత, నైరుతి, తన్మయి, మనోజ్ఞ, హంస, రూప తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో కార్తీక వనభోజనాలు

భగత్‌నగర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగులకు కార్తీక వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. కరీంనగర్-1, కరీంనగర్-2 డిపోల పరిధిలోని ఉద్యోగులు, వారి జీవిత భాగస్వాములతో కలిసి వనభోజనాలుకార్యక్రమం డిపో మేనేజర్లు ఐ విజయమాధురి, వి మల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత, డిప్యూటి రీజినల్ మేనేజర్ ఎస్ భూపతిరెడ్డి, డిపో సూపర్‌వైజర్లు పి విజయలక్ష్మి, తిరుపతి పాల్గొన్నారు.

రాష్ట్రం ఏర్పాటుతోనే ఉద్యమం అవసరాలు తీరలేదు : నారదాసు

కరీంనగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఏ పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ఆమరణ నిరాహారదీక్ష పట్టారో... ఈ రోజు కూడా ఆ పరిస్థితులు పునరావృతం అవుతున్నట్లు కనిపిస్తున్నదని మాజీ ఎమ్మెల్సీ తెలంగాణ ఉద్యమకారుడు నారదాసు లక్ష్మన్‌రావు అన్నారు. 10 నెలల కాంగ్రెస్ పాలనలో పదేళ్ల పాటు కేసీఆర్ చేసిన అభివృద్ధిని విధ్వంసం చేసిందని, టీడీపీ మూలాలు ఉన్న వ్యక్తి ముఖ్యమంత్రి కావడం.. వలసవాద ధోరణిలు మళ్లీ కనిపిస్తూ ఆ పార్టీ మళ్లీ పునర్జీవం పోసుకోవడానికి ప్రయత్నిస్తున్నదని అన్నారు. తెలంగాణ వ్యతిరేకులకు, తెలంగాణప్రజలకు మధ్య ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతూనే ఉన్నదని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతోనే ఉద్యమ అవసరం ముగిసిపోలేదని లక్ష్మన్‌రావు అభిప్రాయపడ్డారు. ప్రజలు దీక్షా దివస్ స్ఫూర్తితో మరో సంకల్ప దీక్ష చేపట్టి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపట్ల పోరాడాలని ఆయన కోరారు.

ఆనవాళ్లు కోల్పోతున్న ఎస్సారెస్పీ కాలువలు

● కాలువల్లో పిచ్చిమొక్కలు, వ్యర్థాలు
● చివరి వరకు నీరందక రైతుల ఇబ్బందులు



ఆరపల్లిలో కాలువలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు



కాలువలోకి చేరుతున్న ఇళ్లలోని డ్రైనేజీ నీరు

కరీంనగర్ రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండల పరిధిలోని ఎస్సారెస్పీ కాలువలు పిచ్చిమొక్కలు, వ్యర్థాలతో దర్శనమిస్తు న్నాయి. కొన్ని ప్రాంతాల్లో పిల్ల కాలువలు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. కరీంనగర్ రూరల్ డివిజన్ పరిధిలో డీ 87 నుంచి డీ 94 ప్రధాన కాలువల ద్వారా మొత్తం 27వేల ఎకరాల్లో సాగవుతోంది. కాలువల్లో పేరుకపోయిన పూడిక, శిథిలమైన డ్రాపులు, కూలిన కాలువల లైనింగ్‌తో చివరి ఆయకట్టుకు నీరందక ప్రతియేటా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఉపాధి హామీపథకం కింద గతంలో ఎప్పటికప్పుడు సిల్టును తొల గించేవారు. ఇప్పుడు పూడిక తీతకు నిబంధన అడ్డంకి రావడంతో కాలు వల్లో చెత్త చెదారం తొలగించలేని పరిస్థితి ఉంది. ఏడాదికోసారి కాలువల్లో పూడిక తీసే అవకాశం లేదు. రెండేళ్లకోసారి మాత్రమే పూడిక తీయాలనే నిబంధన రైతులకు శాపంగా మారింది.

● కాలువల్లోకి వ్యర్థాలు

కరీంనగర్ మండలంలో విలీనమైన గ్రామాల నుంచి ఉన్న కాలువలను పట్టించుకునే వారే లేరు. రేకుర్తి నుంచి సీతారాంపూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్ గ్రామాల్లో ఉపాధిహామీ పనులు లేక కాలు వల్లో పూడిక తీయడం లేదు. ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలతో పాటు, సిల్టు తీయకపోవడంతో కాలువల్లో వ్యర్థ పదార్థాలు చేరి కలుషితం అవు తున్నాయి. ఈ గ్రామాల్లో ఇళ్లలోని డ్రైనేజీ నీరు కూడా కాలువల్లోకే వదులుతుండటంతో కాలువల్లో మురికి నీరు చేరుతోంది. అధికారులు స్పం దించి రానున్న రబీ సీజన్‌లో కాలువల్లో పూడిక తీయించి పంటలకు సాగు నీరు అందించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

మాలల సింహగర్జన పోస్టర్ ఆవిష్కరణ

మానకొండూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో డిసెంబరు 1న నిర్వహించే మాలల సింహగర్జన పోస్టర్‌ను గురువారం మానకొండూర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కాడే శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ చేపట్టిన పాదయాత్ర ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లో సింహగర్జన సభను నిర్వహిస్తున్నామని చెప్పారు.ఈ సభకు మండలంలోని మాలలు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు బొల్లం వెంకటస్వామి, నాయకులు గూడ కిష్టయ్య, కునమల్ల చంద్రయ్య, రొడ్డ మహేందర్, తడకపల్లి నారాయణ, రొడ్డ నరేందర్, రొడ్డ రామస్వామి పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో కలెక్టర్ పూజలు

చిగురుమామిడి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుందరగిరి గ్రామంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో కలెక్టరు పమేలా సత్పతి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు కలెక్టర్‌కు పూజలు అనంతరం ఆశీర్వచనం చేశారు. ఆలయంలో నిర్వహించే వైకుంఠ ఏకాదశి వేడుకలకు హాజరుకావాలని కలెక్టరును హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి కోరారు. తప్పకుండ వస్తానని కలెక్టరు హామీ ఇచ్చినట్లు చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముద్దసాని రమేశ్, ఎంపీడీవో బాస మధుసూధన్ పాల్గొన్నారు.

నేడు మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటన

చిగురుమామిడి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): చిగురుమామడి మండలంలో శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించనున్నారని తహసీల్దార్ ముద్దసాని రమేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముదిమాణిక్యం గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని, మండల కేంద్రంలో అంగన్‌వాడీ భవనం పనులకు భూమి పూజ నిర్వహిస్తారని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న మహిళలు



ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న మహిళలు

మానకొండూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మానేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను గురువారం మానకొండూర్‌లో మహిళలు అడ్డుకున్నారు. శ్రీనివాస్‌నగర్, లింగాపూర్, వెల్ది గ్రామాలలోని మానేరు వాగు నుంచి కరీంనగర్‌తో పాటు ఇతర పట్టణాలకు పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఇసుక ట్రాక్టర్లు నడవడంతో దుమ్ముతో పాటు శబ్ద కాలుష్యంభరించలేక పోతున్నామని వాపోయారు. ట్రాక్టర్ డ్రైవర్‌లు అధిక స్పీడ్‌తో వెళ్లడం వల్ల ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

గంగాధర, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గంగాధర మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం ఎంఈవో ప్రభాకర్‌రావు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఇటీవల కొత్త బియ్యం వంట తిన్న తరువాత పలువురు విద్యార్థులకు కడుపునొప్పి, వాంతులు అయిన ఘటన చోటు చేసుకుంది. దీంతో గంగాధర జడ్పీహెచ్‌ఎస్, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

సైదాపూర్: మండలంలోని సోమారం మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు పెట్టె మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో, వీవో రజిత గురువారం పరిశీలించి నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సంపత్ కుమార్ తెలిపారు. విద్యార్థులకు శుచితో కూడిన నాణ్యమైన భోజనం పెట్టాలని సూచించారని తెలిపారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

- వరి కొయ్యలను కాల్చొద్దు
- జిల్లా రైతు శిక్షణ కేంద్రం డీడీఏ చంద్రునాయక్



కరీంపేటలో మాట్లాడుతున్న డీడీఏ చంద్రునాయక్

శంకరపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతులు నేలలో ఉన్న పోషకాలను తెలుసుకొని అధిక దిగుబడులు సాధించడానికి భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా రైతు శిక్షణ కేంద్రం డీడీఏ చంద్రునాయక్ అన్నారు. శంకరపట్నం మండలం కరీంపేటలో గురువారం రైతు శిక్షణ కేంద్రం డీడీఏ చంద్రునాయక్ భూసార పరీక్షల యొక్క విశిష్టత, వరి కొయ్యలు కాల్చడం వల్ల తలెత్తే అనర్థాలపై రైతులకు అవగాహన కల్పించారు. మొక్కలు ఏపుగా పెరిగి అధిక దిగుబడి అందించడంలో భూమిలో ఉన్న పోషకాలు ప్రధాన పాత్ర వహిస్తాయన్నారు. భూసార పరీక్షల ద్వారా ఆ నేల ఏ పంటకు అనువుగా ఉంటుందో తెలుసుకో వచ్చని చెప్పారు. నేలలో ఉండే స్థూల, సూక్ష్మ పోషకాలను తెలుసుకోవచ్చన్నారు. దీని ద్వారా అవసరమైన పోషకాలను అందించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చా న్నారు. రైతులు వరి కొయ్యలను కాల్చకుండా నీటితో తడిపి సింగిల్ సూపర్ పాస్పెట్ చల్లి నేలలో కలియదున్నాలని సూచించారు.. దీంతో నేల సారవంతంగా మారి రైతులు అధిక దిగుబడి సాధించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీధర్, ఏవో వెంకటేష్, ఏఈవో స్రవంతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో భరోసా

గంగాధర, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సీఎంఆర్‌ఎఫ్ పథకం పేద కుటుంబాలకు భరోసాగా నిలుస్తుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గురువారం గంగాధర మండలం గట్టుభూత్కుర్ గ్రామానికి చెందిన బొల్లబత్తిని లక్ష్మికి మంజూరైన 1.50 లక్షల రూపాయల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అందజేశారు. కార్యక్రమం లోనాయకులు రోమాల రమేష్, దుబ్బాసి బుచ్చయ్య, భైరిసంపత్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: మండలంలోని భూపాల పట్నం, వెదురుగట్ట గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు 10 లక్షల రూపాయల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు మహేష్, వైస్‌చైర్మన్ రాజేందర్ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలను సందర్శించిన డీఐఈవో

హుజూరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థి విద్యార్థులను బోధన ఎలా జరుగుతుందని అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో ఫిషరీష్ విద్యార్థులు తయారు చేసిన అక్వేరియంను ప్రారంభించారు. అనంతరం అధ్యాపకులకు సూచనలు చేశారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయరావు పాల్గొన్నారు.

లలితాపూర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠ

మానకొండూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లలితాపూర్ గ్రామంలో గురువారం బొడ్రాయి ప్రతిష్ఠిం చారు. వేద పండితుల సమక్షంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పు,చప్పుళ్ళ మధ్య శివ సత్తుల నృత్యాలతో పోచమ్మ బోనాలను ఎత్తుకొని మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బోనాలను పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మాజీ సర్పంచ్ మర్రి కొండయ్య, మర్రి ఓదెలు, వేముగంటి ప్రసాద్‌రావు, వెల్మారెడ్డి రాంరెడ్డి, బల్ల కిష్టయ్య, మర్రి శ్రీనివాస్, పొలవేని రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై కుట్రలు సరికాదు



మాట్లాడుతున్న బెజ్జంకి అనిల్ మాదిగ

రామడుగు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను అడ్డుకునేందుకు కొందరు కుట్రలు చేయడం సరికాదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్‌మాదిగ అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ విభాగాల మండల స్థాయి నాయకుల సమావేశం మండల ఇన్‌చార్జీ కొత్తూరి రాజన్న మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనిల్ మాదిగ మాట్లాడుతూ 30 ఏళ్లుగా పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న దాన్ని జాతికి అందకుండా కుట్రలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా వర్గీకరణ అమలు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు కొత్తూరి రాజన్న, బెట్టిపల్లి అనిల్‌మాదిగ, గజ్జెల నాగరాజు, రేణుకుంట్ల అశోక్ మాదిగ, రాళ్ల నరేష్ మాదిగ, నమిలికొండ ప్రభాకర్, దాసరి రవిశాస్త్రి, మధు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'గురుకులాలను పట్టించుకోక పోవడం సరికాదు'

చొప్పదండి, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): గురుకులాలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోక పోవడం సరికాదని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ అన్నారు. చొప్పదండిలో గురువారం ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫుడ్ పాయిజన్ అవుతున్నప్పటికీ విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పాఠశాలలు గురుకుల హాస్టల్‌కు సరఫరా అవుతున్న ఆహార వస్తువుల నాణ్యత పై ప్రభుత్వం ఫుడ్ సేఫ్టీ అధికారులతో తనిఖీలు నిర్వహించాలని ఆయన కోరారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రాకేష్, విష్ణు, శ్రీనివాస్, అనిల్, చరణ్, సంజయ్, హరీష్, సాత్విక్, అజిత్, వాసు పాల్గొన్నారు.

● సంక్షిప్తం..

● హుజూరాబాద్‌రూరల్: ఏఐతో రాకతో అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని, విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కిట్స్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ అన్నారు. సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురురవారం ఏఐ ఇన్ వెబ్ డెవలప్‌మెంట్ ఫ్రం ఆటోమేషన్ టూ ఇన్నోవేషన్ ఐదు రోజుల వర్క్‌షాపులో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బ్రైనో విజన్ నిపుణులు ఓబులయ్య, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ యాకుబ్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

● సైదాపూర్: ఆకునూర్ ఉన్నత పాఠశాలకు చెందిన పొడిశెట్టి సంజన, రాయిశెట్టి రాహుల్, పెద్ది సాత్విక అండర్-17 విభాగంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికవడంతో ప్రధానోపాధ్యాయుడు రామస్వామి తదితరులు అభినందిచారు.

● గంగాధర: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రైతన్న పండగా గొప్పగా నిర్వహిద్దామని గంగాధర మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజితశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతన్న పండగ ఫ్లెక్సీలను డైరెక్టర్లతో కలిసి ఏర్పాటు చేశారు.

● చొప్పదండి: చొప్పదండిలోని శ్రీమణికంఠ వేంకటేశ్వర ఆలయంలో అయ్యప్ప దీక్షాపరులకు దారుల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

- లయన్స్ క్లబ్ ఎడ్యుకేషనల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చొప్పదండి జడ్పీ ఉన్నత బాలుర పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం రెండు వాటర్ స్టోరేజ్ ట్యాంక్‌లను అందజేశారు. జిల్లా రెండో ఉప గవర్నర్ లయన్ మోర భద్రేశం, ట్రస్ట్ అధ్యక్షులు పెద్ది లక్ష్మీకాంతం తదితరులు ఉన్నారు.

● తిమ్మాపూర్; అలుగునూర్‌లో శుక్రవారం నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమానికి బీఆర్ఎస్ శ్రేణులు, తెలంగాణ వాదులు, ప్రజలు ఎల్ఎండీకాలనీలో గల అమరవీరుల స్థూపం వద్దకు చేరుకోవాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు.

● వీణవంక: జిల్లా కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేపట్టనున్న దీక్ష దివస్‌ను నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు.

● ఇల్లందకుంట: మండల కేంద్రంలోని కేజీబీ వీ పాఠశాలలో గురువారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మెడికలాఫీసర్ డాక్టర్ తులసీదాస్, డాక్టర్ కల్యాణ్ లావణ్య పాల్గొన్నారు.